క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న బౌద్ధ మత ప్రచారకుడు ధర్మానంద

మల్కాపురం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని బౌద్ధ మత ప్రచారకుడు ధర్మానంద అన్నారు. 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలో రామచంద్ర బౌద్ధరామమ్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. కాలుష్య సమస్యకు చెక్ పెట్టాలంటే ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కోరారు.

సందడిగా సామూహిక సీమంతాలు



సీమంతాల్లో గర్భిణులు, ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు పాల్గొని గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాశన చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు, సెక్టార్-2 ఐసీడీఎస్ ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌సంజీవ్‌కాలనీ కొండ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి సోమవారం స్థానిక నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 20లక్షల జీవీఎంసీ నిధులతో రక్షణ గోడ నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు.

మితిమీరుతున్న మందుబాబుల ఆగడాలు



63వ వార్డులోని ఖాళీ భవనం ఆవరణలో మందు గ్లాసులు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవలో ఆదర్శ రాయల్ పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ భవనం ఆకతాయిలకు అడ్డాగా మారింది. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆ భవనం వద్ద మద్యం సేవించి అటువైపు రాకపోకలు సాగించే మహిళల పట్ల వెకిలిగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మరో వైపు ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మద్యం గ్లాసులు, సిగరెట్ పీకలు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రోజు ఇదే తంతు ఉండడంతో సమస్యను మల్కాపురం పోలీసులకు వివరించినా కనీసం చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని మందు బాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు

సీతంపేట: శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవం సోమవారం జరిగింది. ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి అవతార విశిష్టతను అన్నమాచార్యులు సంకీర్తనా రూపంలో భక్తులకు తెలియజేశారన్నారు. విద్యార్థులు సంగీతంతోపాటు చదువులోనూ రాణించాలని సూచించారు. శృతిలయ సంస్థ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసించారు. అనంతరం ఆగమ పండితులు పి.రంగనాథ ఆచార్యులు, వీటెలీ బ్యూరో ఎంఎస్ఆర్ ప్రసాద్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు.

నాడు- నేడు పనులకు గ్రహణం!

విద్యతోనే భవిత మారుతుంది.. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందాలి. అందుకు తగ్గట్టుగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు ఉండాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. నాడు- నేడు తొలిదశలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. అలాగే రెండో విడతలో మరిన్ని పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా పనులకు శ్రీకారం చుట్టారు. ఇంతలో ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వం రావడంతో రెండో విడత నాడు- నేడు పనులకు గ్రహణం పట్టింది. ఫలితంగా విద్యార్థులు అరకొర వసతుల మధ్య చదువులు సాగిస్తున్నారు.



గోపాలపట్నం బాలికోన్నత పాఠశాలలో నిలిచిన తరగతి గదులు



పద్మనాభనగర్ ప్రాథమిక పాఠశాలలో పిల్లర్లస్థాయిలో...





హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో చివరిదశలో నిలిచిన పనులు

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన పనులను కూడా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి. మరి కొన్ని చోట్ల ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. కనీసం వీటిని పూర్తి చేయాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రధానంగా జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు గదులు చాలక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అవసరమైన నిధులు విడుదల చేసి వేసవి సెలవుల్లోనైనా పనులు పూర్తి చేసి నూతన భవనాలను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



గోపాలపట్నం హైస్కూల్‌లో నేలపై విద్యార్థుల చదువులు

రెండో విడతలో మంజూరైన నిధులు.. పని చేసిన వివరాలు ఇలా ..

మండల పరిషత్ పాఠశాలలు

పాఠశాల	మంజూరు	విడుదల	ఖర్చు	మిగిలిన నిధులు
కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల	రూ.21.98లక్షలు	రూ.8.98లక్షల	రూ. 8.89లక్షలు	రూ. 9,326
యల్లపువానిపాలెం	రూ. 25.97లక్షలు	రూ. 8.48లక్షలు	రూ.6.79లక్షలు	రూ.1.69లక్షలు
హెచ్‌సీ వెంకటాపురం	రూ. 17.89లక్షలు	రూ. 6.86లక్షలు	రూ.6.85లక్షలు	రూ.1,247
గోపాలపట్నం-1	రూ. 22.83లక్షలు	రూ. 5.30లక్షలు	రూ.5.27లక్షలు	రూ. 3,158
లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్	రూ. 19.44లక్షలు	రూ. 9.17 లక్షలు	రూ.6.71 లక్షలు	రూ. 2.45 లక్షలు
వెంకటాపురం	రూ. 82.53 లక్షలు	రూ. 29.16 లక్షలు	రూ.29.13 లక్షలు	రూ.3,127
శేపేపాలెం	రూ. 54.68 లక్షలు	రూ.37.49 లక్షలు	రూ.37.48 లక్షలు	రూ.1000
ఇందిరానగర్	రూ. 25.89 లక్షలు	రూ. 12.85లక్షలు	రూ.12.85లక్షలు	--
గోపాలపట్నం-2	రూ. 22.24 లక్షలు	రూ.16.18 లక్షలు	రూ. 16.10 లక్షలు	రూ.8,000
జిల్లా పరిషత్ పాఠశాలలు...				
గోపాలపట్నం హైస్కూల్	రూ.24 లక్షలు	రూ.15.32 లక్షలు	రూ.14.24లక్షలు	రూ.1.08 లక్షలు
గోపాలపట్నం బాలికలు	రూ.24 లక్షలు	రూ.17లక్షలు	రూ.14.08 లక్షలు	రూ.2.92లక్షలు
కొత్తపాలెం	రూ. 1.54కోట్లు	రూ. 48.78లక్షలు	రూ.48.78	--
యల్లపువానిపాలెం	రూ. 1.20కోట్లు	రూ. 76.57లక్షలు	రూ.76.25లక్షలు	రూ.31,777
హెచ్‌సీ వెంకటాపురం	రూ.1.30కోట్లు	రూ.76 లక్షలు	రూ.75.91 లక్షలు	రూ.8,200

తరగతి గదులు పూర్తి చేయాలి

తరగతిగదులు త్వరితగతిన పూర్తి చేయాలి. పనులు మధ్యలో నిలిచిపోవడం వల్ల నిధులు వృథా అవుతాయి. విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

-వెంకటరణ, యల్లపువానిపాలెం

సెలవుల్లో నైనా పూర్తి చేయాలి

మధ్యలో నిలిచిపోయిన పాఠశాలల భవనాలను ఈ వేసవి సెలవుల్లో నైనా పూర్తి చేయాలి. తగినన్ని తరగతి గదులు లేక పోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త వారు వస్తే ఇంకా ఇబ్బంది పడాల్సి వస్తుంది. పాలకులు,అధికారులు దృష్టిసారించాలి.

- సత్తిబాబు, గోపాలపట్నం

ప్రాధాన్యం ప్రకారం పనులు చేపడతాం

ప్రాధాన్యం ప్రకారం పాఠశాలల్లో నిలిచిన నాడు- నేడు పనులు చేపతాం. ఇందుకు మళ్లీ నిధులు మంజూరవుతున్నాయి. కొన్ని పాఠశాలలకు నిధులు వచ్చినట్టు సమాచారముంది. ప్రధానంగా తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచిస్తున్నాం. త్వరిత గతిన పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

-దివాకర్, ఎంఈవో గోపాలపట్నం

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు 2, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున పలువురు అర్జీలు సమర్పించారన్నారు. వినతులను జెడ్సీ పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, భరణి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మేడపై నుంచి పడిన మహిళ మృతి

మల్కాపురం: దుస్తులు ఆరబెట్టడానికి మేడపైకి వెళ్లిన ఓ మహిళ జారి పడి మృతి చెందింది. ఈ ఘటనపై మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 61వ వార్డు మల్కాపురం సమీపాన గల ఇండస్ట్రియల్‌కాలనీలో గవిరెడ్డి కోమలి (32), భర్త శ్రీనుబాబు పిల్లలతో కలిసి గత కొంత కాలం నుంచి నివసిస్తున్నారు. సోమవారం ఉదయం దుస్తులు ఆరబెట్టడానికి మూడో అంతస్తు పైకి వెళ్లింది. ఆసమయంలో ఆమె కళ్లు తిరిగాయో మరే కారణమో గానీ కింద పడడంతో తీవ్రంగా గాయపడింది. ఒక్కసారిగా శబ్దం రావడంతో దిగువన ఉన్న వారితో పాటు కోమలి కుటుంబ సభ్యులు వచ్చిచూడగా తీవ్రగాయాలతో ఉంది. వెంటనే స్థానిక ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని చెప్పారు. మృతురాలి భర్త శ్రీనుబాబు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్యుల వద్ద వివరాలు సేకరించారు. శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు మంగళవారం తరలిస్తామని పోలీసులు వివరించారు. అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ విద్యాసాగర్ వివరించారు. మృతు రాలి భర్త శ్రీనుబాబు మాజీసైనిక ఉద్యోగి.

విద్యార్థులకు గ్రాండ్ వెల్‌కమ్



విద్యార్థులు స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం రమణికుమారి

మల్కాపురం: చదువు వెలుగునిస్తుంది.. చదువు దేశానికి మంచి మేధావిని అందించే శక్తిని ఇస్తుందని.. చదువు పేదరికాన్ని రూపుమాపి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకు వెళ్తుంది.. చదువే ఈ లోకానికి మీరంటే ఏమిటో తెలియజేస్తుందని మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి అన్నారు. పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసి ఆరో తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థులకు సోమవారం గ్రాండ్‌గా వెల్‌కమ్ పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమణికుమారి మాట్లాడుతూ ఎంతో ఆశతో,ఎన్నో ఆశయాలతో తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పిస్తారు.. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వారి ఆశయానికి తగ్గట్టుగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో ఉత్తమ బోధన అందిస్తామని, బాగా చదువుకుని పాఠశాలకు మంచి పేరుతేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆరో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఉపాధ్యాయులను పరిచయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



హెచ్‌ఎం రమణికుమారిని సత్కరిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు తదితరులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లోని త్రినాథపురం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దినందుకు హెచ్‌ఎం రమణకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్. వెంకటరావు, మోడల్ స్కూల్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసలాల్, అధ్యాపకులు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భుజంగరావు

మల్కాపురం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని పేదలకు తక్షణమే ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఇంటి పట్టాల సమస్యపై సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ములగాడ హౌసింగ్‌కాలనీ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జగ్గునాయుడు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలు జీవో నెంబర్ 30 ప్రకారం ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసి ఏడాది కావస్తున్నా ఇంత వరకూ కనీసం విచారణ చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే దరఖాస్తులు పరిశీలించి అర్హులందరికీ పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత గ్యాస్ అందరికీ ఇవ్వడం లేదు సరికదా.. ఇప్పుడు రూ.50 పెంచి అదనపు భారం మోపారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆందోళన కారుల వద్దకు తహసీల్దార్ భుజంగరావు వచ్చి డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో సీపీఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావు,పైడిరాజు,విమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి



ప్రొఫెసర్ యాగంటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(న్యూఢిల్లీ) ప్రొఫెసర్, ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ యాగంటి చిన్నారావు సోమవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులతో ఇంట్రాక్షన్ అయ్యారు. ప్రతి విద్యార్థి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ దేశ రక్షణ, పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ యాగంటి చిన్నారావు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహించడం మన కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యాగంటిని అధ్యాపక బృందం సత్కరించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ శంకరనారాయణరావు, పొలిటికల్ విభాగాధిపతి జె.రామారావు, అనంతలక్ష్మి, డి.గాయత్రి, లావణ్య, బీఎస్ మూర్తి, ప్రసన్న పలువురు అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా సచివాలయ భవనం



సచివాలయ ప్రవేశ వద్ద ధూళితో నిండి ఉన్న ఫ్లోర్



సచివాలయం వెనుక మార్గంలో ఇలా..

- పరిసరాలు దుమ్ము,ధూళిమయం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మరిడిమాంబ కల్యాణమండపం పైన ఏర్పాటు చేసిన మల్కాపురం పల్లివీధి,జాలరివీధి,గాంధీజీవీధి సచివాలయాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీస నిర్వహణ పట్టించుకోక పోవడంతో ఆవరణ అంతా అధ్వానంగా ఉంది. వివిధ పనులపై సచివాలయాలకు వస్తున్న ప్రజలు ఆవరణను చేసి అవాక్కవుతున్నారు. ఉద్యోగులు ఉండేలా కార్యాలయాల నిర్వహణ ఇలా ఉంటే.. ప్రజలకు ఇంకేం సేవలందిస్తారని విస్తుపోతున్నారు. కార్యాలయంలో అంతా ఉద్యోగులు ఉండడంతో ఎవరూ శుభ్రం చేయడం లేదు.ఉద్యోగులు విధులు నిర్వహించే ప్రదేశంతో పాటు కంప్యూటర్ టేబుల్స్ సైతం దుమ్ము,ధూళితో నిండి ఉన్నాయి. కనీసం వార్డు శానిటరీ సిబ్బంది సాయంతోనైనా సచివాలయాల పరసరాలను పరిశుభ్ర పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు దరఖాస్తు దారులు కోరుతున్నారు.

సీపీఐ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సింథియా: సీపీఐ 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజక వర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు కోరారు. ఈ మేరకు సోమవారం సింథియా జంక్షన్ వద్ద మహాసభలకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మే 10,11 తేదీల్లో మరళీనగర్‌లో సీపీఐ 25వ మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్వీ త్రినాథ్, కామేశ్వరరావు, వై.కనకేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవంలో బాలలకు సౌకర్యాలు కల్పించాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే బాలలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. చిన్నారులకు వారి తల్లులు పాలు పట్టేందుకు వీలుగా క్యూల్లో తగినన్ని ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బాలలకు మంచి నీరు, వేడి పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను త్వరితగతిన వారి తల్లిదండ్రులకు అప్పగించేలా పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు.

గంధం అమావాస్యకు ఏర్పాట్లు

సింహాచలం: ఈ నెల 27న గంధం అమావాస్య సందర్భంగా వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు సోమవారం తెలిపారు. 28 నుంచి వచ్చేనెల 2 వరకు ఆలయంలో భగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్ర పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ రోజుల్లో రాత్రి 7 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయన్నారు. ఆర్జిత సేవలన్నీ నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. 29న సాయంత్రం 6 వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

27న ఉక్కునగరంలో మే డే మార్చ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఈ నెల 27న మే డే మార్చ్ నిర్వహించనున్నామని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై నిర్వహించనున్న మార్చ్ ఆ రోజు ఉదయం 6.30 గంటలకు సెక్టార్-5 త్రిష్టా మైదానం నుంచి ప్రారంభమవుతుందన్నారు. 5 కిలో మీటర్లు నిర్వహించనున్న మార్చ్‌లో ఉక్కు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, ప్రజలంతా పాల్గొవాలని ఆయన కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 78 వార్డు కార్పొరేటర్ బి. గంగారావు నేతృత్వంలో నాయకులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం ఇప్పటికే సుమారు 1500 మంది పైగా కార్మికులను తొలగించిందని వివరించారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.